ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 28 జూలై 2024



ఎడతెరిపి లేని వర్షం..

- పొంగుతున్న వాగులు, వంకలు
- గ్రామాలకు రాకపోకలు నిలిపివేత
- అప్రమత్తమైన అధికారులు
- స్తంభించిన జన జీవనం



పెద్దబొంకూర్-కొత్తపల్లి మధ్య రాకపోకలను నిలిపివేస్తున్న అధికారులు



సబ్బితం-గట్టుసింగారం మధ్య చేపలు పడుతున్న మత్స్యకారులు



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం

పెద్దపల్లి రూరల్, జూలై 27 : మూడు రోజులుగా పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు వరదనీటితో ఉప్పొంగుతున్నాయి. మండలంలోని బొంపల్లి, అప్పన్నపేట, మూలసాల హుస్సేన్‌మియా వాగు, కనగర్తి, రాఘవపూర్, భోజన్నపేట గ్రామాల్లోని చెరువులు నిండుకుండల్లాగా కనిపిస్తున్నాయి. మండలంలోని పెద్దబొంకూర్ నుంచి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో లోలెవెల్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు పారుతుండటంతో ఇరువైపులా ఎవరు రాకుండా దారిని ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మూసివేయించారు. ఈ సందర్భంగా పెద్దబొంకూర్, కొత్తపల్లి గ్రామాల ప్రజలకు వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలెవరు బయటికి రావొద్దని చాటింపు వేయించారు. ఆయన వెంట ఎంపీవో ఫయాజ్ అలీ, పంచాయతీ కార్యదర్శి దేవరనేని సురేందర్‌రావు ఉన్నారు. అలాగే రంగాపూర్ గ్రామంలో కురుస్తున్న వర్షానికి రాసమల్ల మల్లయ్య ఇళ్లు స్వల్పంగా కూలిపోగా బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్.స్వామి వెళ్లి పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలని వారి కుటుంబానికి సూచించారు. సబ్బితం గ్రామంలోని గట్టు సింగారం వెళ్లే దారిలో వరదనీరు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండటంతో మత్స్యకారులు చేపలు పట్టే పనిలో నిమగ్నం అయ్యారు. అలాగే కొత్తపల్లి గ్రామం మీదుగా కొలనూర్ వెళ్లేందుకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించగా అండర్ గ్రౌండ్ మొత్తం వరదనీటిలో నిండిపోయింది. అండర్‌గ్రౌండ్ నిర్మాణం కంటే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఉపయోగం ఉండేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బొంపల్లి గ్రామానికి చెందిన ఇటిక్యాల ఓదెలు పొలం నాటు వేసి 15 రోజులు అవుతున్న దృష్ట్యా వరదనీరు వచ్చి చేరడంతో పంట పాడైపోతుందని విద్యుత్ మోటార్ ద్వారా నిలిచిన నీటిని తొలగిస్తున్నారు. నీరు అలాగే నిలిచి ఉంటే పంట పూర్తిగా దెబ్బతింటుందని రైతులు పేర్కొన్నారు. దీంతో గ్రామాల్లో పలు శాఖల అధికారులు అప్రమత్తమై గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కళ్యాణ్‌నగర్, జూలై 27: బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో పది రోజులుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విడువకుండా వానలు దంచి కొడుతున్నాయి. దీంతో జన జీవనం స్తంభించింది. రాత్రిపగలు తేడాలేకుండా వర్షం కురువడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకురావడంలేదు. శుక్రవారం 22.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, శనివారం 36.9మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. శనివారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ వ్యాపార కూడళ్లు జనంలేక వెలవెలబోయాయి. ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటకం ఏర్పడుతోంది. రామగుండం రీజియన్‌లోని నాలుగుఓపెన్‌కాస్టుల్లో వర్షాలతో క్వారీ అంతా బురదమయమై డంపర్లు నడవక బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుంది. శనివారం ఉదయం కురిసిన భారీవర్షం ఫైవింక్లయిన్, 2ఏ మోరీలు నిండుగా ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరో రెండురోజులు కూడా భారీవర్షాలు ఉంటాయని వాతావరణశాఖ సూచించింది.

కమాన్‌పూర్, జూలై 27 : మండలంలోని గుండారం రిజర్వాయర్‌ను తహసీల్దార్ అరిఫోద్దీన్ శనివారం పరిశీలించారు. వారం రోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌లోకి వర్షపు నీరు భారీగా చేరుతోంది. గుండారం రిజర్వాయర్‌లోకి గౌరి గుండం ద్వారా పెద్దఎత్తున వరద చేరడంతో 12 అడుగుల కెపాసిటీ ఉన్న రిజర్వాయర్ ఈ పాటికి నిండుకుండలా కళకళలాడుతోంది. అలాగే భారీగా నీరు చేరడంతో మత్తడి ద్వారా నీరు మండల వాగు చౌటు వాగు ద్వారా మంథని గోదావరిలోకి చేరుతోంది. రిజర్వాయర్ నిండిపోవడంతో తహసీల్దార్ ఆర్‌ఎస్‌బీ గేట్లను పరిశీలించారు. అలాగే కరకట్ల తదితర వాటిని పరిశీలించారు. వెంట ఆర్‌ఐ గౌతమ్ తదితరులు ఉన్నారు.

జూలపల్లి, జులై 27 : మండలంలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాత ఇళ్లు, గోడలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ అన్నారు. మండల కేంద్రానికి చెందిన పిట్టల రాజయ్య ఇల్లు వర్షానికి కూలిపోవడంతో శనివారం ఎంపీడీవో పద్మజ కాలనీని సందర్శించి కూలిన ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.




గుండారం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్



జూలపల్లిలో వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో పద్మజ

మిడ్ మానేరుకు గోదావరి జలాలు

- శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ..
- నంది పంప్ హౌస్ 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
- ప్రభుత్వ ఆదేశాలతో మోటార్లు ఆన్ చేసిన అధికారులు
- ప్రవాహాన్ని బట్టి రోజుకు 2 టీఎంసీల తరలింపు



ధర్మారం మండలంలోని నంది మేడారం పంప్‌హౌస్ నుంచి నాలుగు మోటార్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పెద్ద ఎత్తున వరద నీరు వస్తోంది. దీంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మిడ్ మానేరులోకి ఎత్తిపోయడం ప్రారంభమైంది. శనివారం మధ్యాహ్నం నంది మేడారంలో గల నంది పంప్‌హౌస్ ఒక మోటారును ఆన్ చేసి సాయంత్రం వరకు క్రమంగా నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఈసారి కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయకుండానే శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తుండడం గమనార్హం. - 7లో..

ప్రత్యేక ఐసీయూను ఏర్పాటు చేయండి

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసిన డీహెచ్‌పీఎస్



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 27: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సింగరేణి కార్మిక కుటుంబాల కోసం 50పడకల ప్రత్యేక ఐసీయూ వార్డును ఏర్పాటు చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దెల దినేష్, ఏఐటీయూసీ కాంట్రాక్టు అనుబంధ సంఘం అధ్యక్షులు ఎంఏ గౌస్ శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్‌ను కోరారు. మెడికల్ కళాశాల కోసం సింగరేణి యాజమాన్యం రూ.520కోట్లు మంజూరు చేసిందని, సింగరేణి కార్మిక కుటుంబాలకు, మాజీ కార్మిక కుటుంబాలకు ప్రత్యేకంగా ఆసుపత్రిలో 50పడకలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వాసుపత్రిలో ఎంఆర్‌ఐ స్కానింగ్ లేకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు స్కానింగ్ కోసం ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారని, దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డయాగ్నోస్టిక్, ఫిజియోథెరపీ సెంటర్లను ఏర్పాటుచేయాలని కోరారు. ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వారంవారం షిఫ్టులు చేంజ్ చేసే విధంగా చూడాలని, కార్మికులు తెలిసో తెలియకో చిన్నచిన్న తప్పులు చేస్తుంటే వారిని విధుల నుంచి తొలగించడం బాధాకరమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు నెలనెల వేతనాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

రామగిరి, జూలై 27: పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులకు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యలపై దృష్టి పెట్టి తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని పెండింగ్ ధరణి సమస్యలు, భూసేకరణ, సర్టిఫికెట్ జారీ తదితర అంశాలపై అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సమావేశంలో చర్చించారు. వెల్గలపహాడ్, అటవీ భూముల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మీ సేవా ద్వారా వచ్చిన సర్టిఫికెట్స్ దరఖాస్తులను పరిశీలించి వెనువెంటనే జారీచేయాల్సిందిగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్‌ఐలు మహేష్‌బాబు, నిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్‌డీవో

రామగిరి, జూలై 27: మండలంలోని మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి కల్వచర్ల రోడ్డుకు ఇరుపక్కల చేపడుతున్న అవెన్యూ ప్లాంటేషన్ పనులను డీఆర్‌డీవో రవీందర్‌రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కల ఏర్పాటును పూర్తిచేయాలని సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఆయన వెంటగా ఎంపీడీవో శైలజారాణి, ప్లాంట్ సూపర్‌వైజర్, ఫీల్డ్‌అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్న పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో దేశీ శిక్షణలో భాగంగా డిప్లోమా కోర్సు పూర్తి చేసుకున్న వ్యవసాయ విత్తన, ఎరువుల డీలర్లకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకుని డిప్లమా పట్టా పొందిన డీలర్లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డిప్లమో కోర్సులు మనం నేర్చుకున్న పరిజ్ఞానాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేడీఏ ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల డీలర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ సాగును విస్తరించాలి..

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు జిల్లాలో ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం తన చాంబర్‌లో ఉద్యానవన శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం మన జిల్లాలో 2 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1500 ఎకరాల పరిధిలో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 200 ఎకరాల విస్తీర్ణంలో ప్లాంటేషన్ జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, జేడీఏ ఆదిరెడ్డి, హార్టికల్చర్ అధికారులు జ్యోతి, శ్రీకాంత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు

పెద్దపల్లిటౌన్, జూలై 27: జిల్లాలోని ఐటీఐ కేంద్రం అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దపల్లి ఐటీఐను కలెక్టర్ పరిశీలించారు. ఐటీఐలకు అనుసంధానంగా నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ పనుల పురోగతి, ఐటీఐ కోర్సులు, యూనిట్ల వివరాలు, విద్యార్థుల సంఖ్య, క్యూసీఐ గ్రేడింగ్, ఐటీఐ కేంద్రానికి ప్రస్తుతం ఉన్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి ఐటీఐలో 9ట్రేడ్‌లు, 22యూనిట్లు ఉన్నాయని, దాదాపు 472మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో కాంపౌండ్ వాల్ కొంత దెబ్బతిందని, అదేవిధంగా ఐటీఐ సెంటర్‌లో రా మెటీరియల్, ఎక్విప్మెంట్ కొరత ఉందని, దీనిని అధిగమించేందుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెద్దపల్లిలోని ఐటీఐ సెంటర్‌కు క్యూసీఐ 8.5 గ్రేడింగ్ ఉందని, దీనిని మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీఐ కేంద్రాల ద్వారా యువతకు మంచి నైపుణ్యాలు అందించాలని, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఐటీఐ కేంద్రం సమర్థవంతంగా నిర్వహించాలని, ఐటీఐ సెంటర్ నిర్వహణ అవసరమైన రా మెటీరియల్, ఇతర సమస్యల పరిష్కార ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐటీఐ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఐటీఐ ప్రాంగణంలో నాటే మొక్కల సంరక్షణకు ట్రీ గార్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ ఐటీఐ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఐటీఐ ప్రిన్సిపాల్ బి.వెంకటరెడ్డి, శిక్షణ అధికారులు జి శ్రీనివాసరావు మల్లికార్జునరావు దత్తాత్రేయ, ఇతర సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చర్చలు సానుకూలం



కార్మిక సంఘం నాయకులను సన్మానిస్తున్న సీవోవో

పాలకుర్తి, జూలై 27: కేశోరాం సిమెంటు కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పలు సమస్యల పరిష్కారం కోసం శనివారం కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక్ హరి, ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్‌లు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభయ్ దాదిచ్ హెడ్ ఆఫీస్ హైదరాబాదు, ప్లాంట్ హెడ్‌ఎం శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ పి ప్రార్థసారధిలతో జరిగిన చర్చలు సానుకూలంగా జరిగాయని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకవెళ్లామని, అందుకు అధికారులు సైతం స్పందించి వారంలోపు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షప్రధాన కార్యదర్శులను అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ముఖ్య సలహాదారులు పెరుమండ్ల రమేష్, బత్తిని సత్తీష్‌గౌడ్, వేల్పుల సంపత్,పూసాల ప్రసాద్, సాదిక్, కొమురయ్య, శంకర్, సుమన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కలాంకు బీఆర్‌ఎస్ నేతల ఘన నివాళి

మంథని, జూలై 27: మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు పార్టీ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్షిపణి శాస్త్రవేత్తగా, భారతరత్న అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను వారు కొనియాడారు. రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, జంజర్ల శేఖర్, ఆసిఫ్ ఖాన్, అంబటి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ నిధులు కేటాయించేలా తీర్మానం చేయాలి



చైర్‌పర్సన్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్

పెద్దపల్లిటౌన్, జూలై 27: పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో టెండర్ ద్వారా నిర్వహించిన తై బజార్ వసూళ్లను నిలుపుదల చేసినందున రూ. కోట్ల రూపాయలు నిధులను విడుదల చేయాలని కోరుతూ తీర్మానం చేసి లేఖను స్థానిక ఎమ్మెల్యేకు అందించాలని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు శనివారం చైర్‌పర్సన్ మమతరెడ్డి, కమిషనర్ వెంకటేష్‌లకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే విజయరమణారావు అభిప్రాయం మేరకు తైబజార్ వసూళ్లను నిలుపుదల చేసినందున మున్సిపల్ ఆదాయం కోల్పోయిందని, పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిందని ఆమె వివరించారు. తైబజార్ ద్వారా సమకూరే కోట్ల రూపాయల నిధులు మున్సిపల్ కు కేటాయించేలా ఎమ్మెల్యేను కోరాలని వినతిలో పేర్కొన్నారు. సాధారణ సమావేశంలో తీర్మానం చేసి, తీర్మానంతో కూడిన లేఖను ఎమ్మెల్యేకు అందించాలని భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు.





వడ్డీ వ్యాపారిపై కేసు


సిరిసిల్ల క్రైం, జూలై 27: సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన దుబాల మొండయ్య అనే వడ్డీ వ్యాపారిపై శనివారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇంటి పత్రాలు, ఖాళీ బాండ్ పేపర్లు తాకట్టు పెట్టుకొని మొండయ్య అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లు, కట్టనివారి ఆస్తులు అక్రమంగా స్వాధీన చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటేస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.







నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



మంథని, జూలై 27: భూమి కోసం.. భుక్తి కోసం.. పీడిత ప్రజల విముక్తి కోసం.. దశాబ్దాలుగా సాగుతున్న ప్రజా పోరులో నేలకొరిగిన మృత వీరులను స్మరించుకునేందుకు సీపీఐ మావోయిస్టు పార్టీ ఏటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించుకుంటోంది. వారోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ ఇప్పటికే పత్రికా ప్రకటనతో పిలుపునిచ్చింది. నక్సల్బరి-శ్రీకాకుళం పోరాటాల వారసత్వాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పునికి పుచ్చుకుంది. ఈ చైతన్య ఉద్యమ వారసత్వ కారణంగా మంథని, పెద్దపల్లి, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీల అరాచకాలు, అణచివేతలపై ప్రజలంతా విప్లవోద్యమ చైతన్యంతో ప్రజలు దొరలు, దొరల గడీలపై దండ యాత్రలు చేయడంతో పాటు జగిత్యాల జైత్రయాత్రతో పోరాటాల ఖిల్లా చరిత్రకెక్కింది. సీపీఐ మావోయిస్టు పార్టీకి సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి దశాబ్దాల కాలంగా ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత జగిత్యాల) బీర్‌పూర్ గణపతి స్వగ్రామం. గణపతి దళపతిగా పని చేసిన ఖిల్లా అయిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు మూడున్నర దశాబ్దాలకుగా పైగా సాగుతున్న విప్లవోద్యమంలో వందల సంఖ్యలో వీరులు అమరలయ్యారు. నిరంతరం పోలీసుల దాడులు.. వరుస ఎన్‌కౌంటర్.. పెరిగిన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్.. తగ్గిన రిక్రూట్‌మెంట్ల కారణంగా కొన్ని సంవత్సరాలుగా మావోయిస్టులు తమ కార్యకలాపాలను అటవీ ప్రాంతాలకే పరిమితం చేశారు.













మిడ్ మానేరుకు గోదావరి జలాలు

● శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ.. ● నంది పంప్ హౌస్‌కు 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
● ప్రభుత్వ ఆదేశాలతో మోటార్లు ఆన్ చేసిన అధికారులు ● ప్రవాహాన్ని బట్టి రోజుకు 2 టీఎంసీల తరలింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరద నీరు పెద్ద ఎత్తున వస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మిడ్ మానేరుకు ఎత్తిపోయడం ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం నంది మేడారంలో గల నంది పంప్‌హౌస్ ఒక మోటారును ఆన్ చేసి సాయంత్రం వరకు క్రమంగా నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఈసారి కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయకుండానే శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తుండడం గమనార్హం. పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శనివారం ఉదయం 14 వేల క్యూసెక్కులు, ఆ తర్వాత 13 వేలు, ఆ తర్వాత 16 వేలు, సాయంత్రం వరకు 12 వేల క్యూసెక్కులకు పెరుగుతూ, తగ్గుతూ వచ్చింది. మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రాజెక్టు నీటి మట్టం 17.396 టీఎంసీలకు చేరుకోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ నుంచి ధర్మారం మండలంలో గల నంది పంప్ హౌస్‌కు గ్రావిటీ ద్వారా నీటిని వదిలిపెట్టారు. అక్కడి నుంచి మొదట ఒక మోటారును ఆన్ చేసి క్రమంగా సాయంత్రం 5 గంటల వరకు నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని నంది మేడారం రిజర్వాయర్‌లో ఎత్తిపోశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా అండర్ టన్నెల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడ నుంచి మోటార్ల ద్వారా వరద కాలువలో నీటి ఎత్తిపోయడంతో మిడ్ మానేరుకు వెళుతున్నాయి. నంది మేడారం పంప్‌హౌస్‌లో మొత్తం 7 మోటార్లు ఉన్నాయి. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. మొత్తం మోటార్లు నడిస్తే 22,050 క్యూసెక్కుల నీళ్లు అంటే 2 టీఎంసీల నీటిని తరలించవచ్చు. రోజుకు రెండు టీఎంసీలను తరలించే విధంగా అండర్ టన్నెళ్లు, పంప్‌హౌస్‌లను నిర్మించారు. సాయంత్రం 6 గంటల వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సాయంత్రం వరకు 12,931 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగి పోవడం, అన్నారం బ్యారేజీకి బుంగ పడడం, సుందిళ్ల బ్యారేజీకి సీపేజీ సమస్య ఉండడంతో వీటిని సందర్శించిన ఎన్డీఎస్ఏ బృందం మరమ్మతులు చేయాలని సూచించింది. వాటికి మరమ్మతులు జరుగుతుండగానే వర్షాలు మొదలయ్యాయి. దీంతో ఎన్డీఎస్ఏ సూచనల మేరకు మూడు బ్యారేజీల గేట్లు తెరిచి ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో అక్కడి నుంచి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోయడం లేదు. ఎల్లంపల్లి ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలు, కడెం ప్రాజెక్టు నిండి తద్వారా వస్తున్న అదనపు జలాలతో వారం రోజుల్లో 13 టీఎంసీల నీళ్లు ప్రాజెక్టులోకి వచ్చాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం 5.140 టీఎంసీలు కాగా, ఆ మరుసటి రోజు నుంచి కురుస్తున్న వర్షాలతో వరద పెరిగింది.


నీటితో కళకళలాడుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు


నంది మేడారం పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న నీరు

శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్ మానేరు) పూర్తి స్థాయి నీటి మట్టం 27 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీలు, లోయర్ మానేరు డ్యామ్ నీటి మట్టం 24 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. క్యాచ్‌మెంట్ ఏరియాలో పెద్దగా వరద లేక పోగా, ఎస్సారెస్పీకి కూడా వరద లేదు. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లికి వరద పెరిగిన తర్వాత మిడ్ మానేరుకు నీటిని తరలించాలని నాలుగు రోజుల క్రితమే ప్రభుత్వం ప్రాజెక్టు అధికారులకు సూచించింది. జూన్ మాసంలో పెద్దగా వర్షాలు పడక పోగా, జూలై ఆరంభంలో కూడా గడ్డు పరిస్థితులు ఉండడంతో, గత ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ఆన్ చేసి 8 నుంచి 9 టీఎంసీల నీటిని ఎల్లంపల్లిలోకి ఎత్తి పోశారు. ఇంతలో వరుసగా భారీ వర్షాలు పడడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలి పెట్టారు.

మిడ్ మానేరు, ఎల్ఎండీల పరిస్థితి దయనీయంగా ఉండడంతో గేట్లనుఎత్తకుండా ఎత్తిపోతలను ప్రారంభించారు. ఎల్లంపల్లికి పైనుంచి వస్తున్న వరద నీటిని వచ్చినట్లే తరలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాలను అంచనా వేస్తూ ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. పైనుంచి వరద పెరిగితే మాత్రం రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించాలని అధికారులు నిర్ణయించారు.

గాయత్రి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల

● నాలుగు పంపుల ద్వారా మిడ్‌మానేరుకు 12,600 క్యూసెక్కుల నీరు


గాయత్రీ పంప్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు

రామడుగు, జూలై 27: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శనివారం సాయంత్రం అధికారులు నీటిని విడుదల చేశారు. మొదట ఒక బాహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు రాత్రి వరకు నాలుగు పంపుల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు. పంప్‌హౌస్ నుంచి నేరుగా బాహుబలి పంపుల ద్వారా గ్రావిటీ కాల్వకు విడుదలైన నీరు నేరుగా వరద కాలువ ద్వారా పరవల్లు తొక్కుతూ ముందుకు సాగింది. ఇక్కడ 7 బాహుబలి పంపులు ఉండగా ఒక్కో పంపు ద్వారా రోజుకు 3150 క్యూసెక్కుల నీరు తరలి తరలించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే ఇక్కడ నాలుగు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తుండగా 12,600 క్యూసెక్కుల నీరు తరలివెళ్తున్నది. వరద కాలువ ద్వారా నీరు రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి వెళ్తుంది. వరద కాలువకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ పూజలు

బీఆర్ఎస్ డిమాండ్ చేయడంతోనే నీటిని విడుదల చేశారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గాయత్రీ పంప్‌హౌస్ వద్ద నీటిలో పసుపు కుంకుమ పూలు చల్లి పూజలు నిర్వహించారు. మరోవైపు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి ఫలితంగానే నీటి విడుదల చేశారని హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు గాయత్రీ పంప్ హౌస్ వద్దకు పెద్ద ఎత్తున తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిడ్ మానేరుకు చేరుకున్న ఎల్లంపల్లి జలాలు

బోయినపల్లి, జూలై 27: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి జలాలు చేరుకున్నాయి. ఎల్లంపల్లి నుంచి నంది మేడారం గాయత్రి పంప్ హౌస్ ద్వారా నీటి ఎత్తిపోతలు శనివారం ప్రారంభం కావడంతో ప్రాజెక్టులోకి రాత్రి 9 గంటల వరకు 2500 క్యూసెక్కుల ప్రవాహం ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 305.62 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 5.90 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ధర్మపురి గోదావరి వద్ద పెరిగిన వరద

● కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు విడుదల


ధర్మపురి వద్ద గోదావరి నది ప్రవాహం

ధర్మపురి, జూలై 27: ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం శనివారం వేగంగా కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండుతున్నాయి. దీనికి తోడు కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. నదీతీర ప్రాంతాలను ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులు, కూలీలు జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, సిబ్బంది చర్యలు చేపట్టారు. రాయపట్నం వంతెన వద్ద ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శనివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 31.035 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 66.508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 605 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 24.766 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.354 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

ఎల్‌ఎండీలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, జూలై27: గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రం వరకు 5.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. మోయతుమ్మెద వాగు నుంచి 576 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. గత సంవత్సరం ఇదే సమయంలో ఎల్ఎండిలో 20 టీఎంసీలకు పైన ఉండగా పైనుంచి మోయతుమ్మెద, ఎంఎంఆర్ నుంచి కలిపి సుమారు 19వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లోలు ఎల్ఎండిలోకి వస్తుండటంతో ఎల్ఎండి పూర్తి స్థాయిలో నిండుతుండగా అధికారులు 16గేట్లు ఎత్తి 56వేల క్యూసెక్కులకు పైగా దిగువకు గోదావరిలోని నీటిని విడుదల చేశారు. కానీ ప్రస్తుతం ఎల్ఎండీ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎగువన కుంటలు, వాగులు,చెరువులు మత్తడి దూకకపోవడంతో పాటు, పైనుంచి మోయతుమ్మెద వాగులోనికి వరద నీరు కూడా రాకపోవడంతో ఎల్ఎండీలోని నీటి ఇన్‌ఫ్లోలు చాలా స్వల్పంగా ఉన్నాయి.


ఎల్ఎండీ రిజర్వాయర్

పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక మెడికో ఆత్మహత్య


కోమళ్ల శిరీష(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 27: పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక కరీంనగర్ శివారులోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోమళ్ల శిరీష(20) అనే విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదులోని వివరాల ప్రకారం..మరో మూడు రోజుల్లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్షలు ఉండటంతో ఒత్తిడిని భరించలేక శిరీష ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చదువు తన నుంచి కావటం లేదని తరచుగా బాధపడిన ఒక్కగానొక్క కూతురు శిరీషను తల్లిదండ్రులు ఓదార్చుతూ భవిష్యత్ బాగుంటుందని సర్దిచెప్పేవారు. శనివారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి కరీంనగర్ నుంచి బస్సులో ప్రతిమ వైద్య కళాశాలకు వెళ్లింది. అనంతరం శిరీష తరగతులు ముగిసిన తరువాత 3 గంటలకు స్నేహితులతో కలిసి కరీంనగర్‌లోని విద్యానగర్‌లో ఇంటికి చేరింది. శిరీష తల్లిదండ్రులు కూడా అదే కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు. సాయంత్రం విధులు ముగించుకుని అందరం కలిసి ఇంటికి వెళదామని తల్లిదండ్రులు శిరీషకు చెప్పినప్పటికీ వినకుండా ఇంటికి చేరుకుంది. వెంటనే తల్లి ఇంటికి చేరుకునే సరికి శిరీష ఉరికి వేళాడుతూ కనిపించింది. దీంతో వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించిందని వెల్లడించారు. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేకనే తన కూతరు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తల్లీ చదువుకుంటావా..

● వ్యవసాయ పనులు చేస్తున్న బాలికతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ● హాస్టల్‌లో చేర్పించి చదివిస్తానని హామీ


బాలికతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

గంగాధర, జూలై 27: గంగాధర మండలం చర్లపల్లి(ఆర్)లో ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఓ బాలికను చూసి కేంద్ర సహాయ మంత్రి సంజయ్ ఎందుకు చదువుకోవడం లేదని ప్రశ్నించారు. కుటుంబ పరిస్థితిపై ఆరా తీశారు. దీంతో తన పేరు బోళ్ల అక్షయ అని టెన్త్ పాసైనప్పటికీ ఆర్థిక పరిస్థితులు బాగోలేక కూలీ పనులకు వెల్లుతున్నానని బదులిచ్చింది. చదువుకోవాలని ఉందని తెలపడంతో వెంటనే అక్కడే ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డిని పిలిచి బాలిక వివరాలు తీసుకుని వెంటనే కాలేజీలో చదివించడంతో పాటు ఆసక్తి ఉంటే హాస్టల్‌లో చేర్పించాలని చెప్పారు. దీంతో బాలిక తండ్రి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, రాష్ట్ర నాయకుడు మేకల ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలుపాలని వినతి


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు విన్నవిస్తున్న కుటుంబం

కరీంనగర్ క్రైం : జీవనోపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలియక ఇబ్బందులు పడుతున్నామని, ఆచూకీ కనుక్కోవాలని శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను బాధితులు కలిశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గురుకులకొండాపూర్ గ్రామానికి చెందిన చొక్కల శ్రీధర్ 2022 జూలై 27న దుబాయికి వెళ్లి అక్కడ షార్జాలోని సరత్ కంపెనీలో పనిచేసేవాడు. కంపెనీలో తక్కువ జీతం, యాజమాన్యం పెట్టే ఇబ్బందులను తట్టుకోలేక 2023 సెప్టెంబరు 7న కంపెనీ నుంచి బయటకు వెళ్లాడు. శ్రీధర్ కుటుంబ సభ్యులు అప్పుచేసి 2023 అక్టోబరు22న విమానం టికెటన్ పంపించారు. కానీ శ్రీధర్ రాలేదు. అప్పటి నుంచి శ్రీధర్ ఆచూకీ లభించలేదు. శ్రీధర్‌కు రెండేళ్ల వయస్సు, ఏడాదిన్నర వయస్సున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీధర్ భార్య చొక్కల అఖిల తన ఇద్దరు కూతుళ్లతో, కుటుంబ సభ్యులు శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి షార్జాలోని ఎంబసీ అధికారులకు మెయిల్ చేశారు. రెండు రోజులు సెలవులు ఉన్నందున సోమవారం వరకు వివరాలు వస్తాయని కేంద్ర మంత్రి చెప్పినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మెట్‌పల్లి రూరల్, జూలై, 27: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలలోని విద్యార్థి రాజారపు గణాధిత్య మృతి చెందడంతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు రాపర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల పట్ల బాధ్యత రహితంగా వ్యవహరించారని, జరిగిన ఘటనపై విచారణ చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యల్లో భాగంగా కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

ధర్మపురి, జూలై 27: ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గోవింద్‌పల్లెకు చెందిన కోల శంకర్ (40) అనే రైతు శనివారం సాయంత్రం మృతి చెందాడు. శంకర్ వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మమత, ఇద్దరు కొడుకుల ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండు ఆలయాల్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో దొంగలు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ప్రధాన ద్వారం తాళాలు పగల కొట్టిన దొంగలు అమ్మవారి బంగారు పుస్తెలు, ముక్కు పుడక ఎత్తుకెళ్లారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 27: కేశవపట్నం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నవేణి లచ్చమ్మ (89) అనే వృద్ధురాలు అనారోగ్య సమస్యలు భరించలేక ఈ నెల 26న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 26న సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడు చెన్నవేణి కొంరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, జూలై 27 : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లికి చెందిన అదృశ్యమైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సదాశివపల్లికి చెందిన గాలిపల్లి శంకర్(40) అనే వ్యక్తి పేయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 25న కూరగాయల కోసం కరీంనగర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా 26న తీగల వంతెన సమీపంలోని చెక్‌డ్యాం వద్ద శంకర్ దుస్తులు కనిపించడంతో అతని భార్యా లీల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి గాలిస్తుండగా శనివారం చెక్‌డ్యాంలో మృత దేహం లభ్యమైనట్లు సీఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రయదారుడి రిమాండ్

మానకొండూర్, జూలై 27 : గంజాయిని విక్రయించేందుకు వెల్లుతుండగా వాహనాల వాహనాల తనిఖీలో పట్టుబడ్డ యువకుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన సంగ వినయ్ అనే యువకుడు 240 గ్రాముల గంజాయిని విక్రయించేందుకు ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు బయలుదేరాడు. సదాశివపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న 240 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు

ఓదెల, జూలై 27 : మండలంలోని పొత్కపల్లి పెద్ద చెరువు మూల మలుపు వద్ద శనివారం కారు ఢీకొని పొత్కపల్లికి చెందిన దానవేని కుమార్, అతని కుమారుడు అర్జున్ సాయిలకు గాయాలయ్యాయి. పొత్కపల్లి నుంచి కుమార్ తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై సుల్తాన్‌బాద్ వైపు వెళుతుండగా, మంచిర్యాలలో క్రషర్ నిర్వహించే వ్యక్తులు జమ్మికుంట వైపు వస్తున్న క్రమంలో పొత్కపల్లి పెద్ద చెరువు మూలమలుపు వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రికొడుకులిద్దరు పొలంలో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, పొత్కపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన ఆన గీత(35) కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అల్మాస్‌పూర్‌కు చెందిన గీతకు వివాహమైన ఐదేళ్లకు విడాకులయ్యాయి. ఏడాది క్రితం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన రాజుతో వివాహమైంది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ నెల 26న రాజు తన భార్య గీతను అల్మాస్‌పూర్‌లోని అత్తిగారింటికి తీసుకొచ్చి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఓ వైపు సంతానం కలగకపోవడం, మరో వైపు తీవ్రమైన కడుపునొప్పి భరించలేక గీత మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల వలయంలో పెద్దాపూర్ గురుకులం

● రెండు రోజుల క్రితం ఫిట్స్‌తో విద్యార్థి మృతి ● విషపురుగు కుట్టి మరో ఇద్దరికి అస్వస్థత ● ఇంటి దారి పట్టిన విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, జూలై, 21: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపు బాలుర గురుకుల పాఠశాల సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందని ద్రాక్షగానే మారాయి. గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి నిధులు కేటాయింపుల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతుండడంతో విద్యార్థులు పాత గదుల్లోనే దినదిన గండంగా చదువులు సాగించాల్సి పరిస్థితి నెలకొంది. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 546 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ వసతులతో కూడిన శాశ్వత భవనాలు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్ కళాశాలను కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 1970లో నిర్మించిన రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. కనీసం పాఠశాలలో కిటికీలు లేని గదుల్లోనే విద్యార్థులు చదువు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం, చలికాలం వచ్చిందంటే విద్యార్థులకు మరిన్ని కష్టాలు ఎదురవుతూనే ఉంటాయి. సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును విద్యార్థులు అప్పట్లో విన్నవించగా 2016లో రూ. 4.25కోట్లు నిధులు మంజూరు చేయించగా 2018లో పనులు ప్రారంభించారు. భవనం మంజూరు అయినప్పటికీ సొసైటీ సంస్థ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వల్ల భవన నిర్మాణ పనులు నత్తనడకగా చేపట్టారు. కనీసం పాఠశాల గదుల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించక పోవడంతో పాములు విష పురుగులతో విద్యార్థులు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గురుకులం నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

పాఠశాలలో శుక్రవారం వేకువజామున విద్యార్థి రాజారపు గణాదిత్య ఫిట్స్‌తో మృతి చెందగా.. మరో ఇద్దరు విద్యార్థులు విష పురుగు కుట్టి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించి వారిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. ఒకే రోజు విద్యార్థి మృతి చెందడం, మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైనా కూడా కనీసం చికిత్స అందించడానికి స్టాఫ్ నర్సు లేకపోవడం గమనార్హం. విద్యార్థులు భయంతో ఇంటి దారి పడుతున్నారు. రాత్రివేళ ఏమైనా ఇబ్బందులకు గురైతే పట్టించుకోవడానికి వైద్య సిబ్బంది లేరని అందుకే ఇంటికి తీసుకెళ్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు.

ముగింపు సభను విజయవంతం చేయాలి

కమాన్‌పూర్, జూలై 27 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈనెల 31న జరిగే సమగ్ర కుల గణన సాధన యాత్ర ముగింపు కార్యక్రమానికి బీసీ కులస్థులు భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ బీసీలకు వెంటనే అమలు చేయాలన్నారు. బీసీల కుల గణన కోసం వెంటనే రూ.150 కోట్లు కేటాయించాలన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం తగ్గకుండా బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

కాల్వ శ్రీరాంపూర్, జూలై 27: మండలంలోని ఆశన్నపల్లి గ్రామానికి చెందిన మంద ఐలయ్య 7నెలల క్రితం మృతి చెందాడు. ఇటీవల తల్లి భాగ్య కూడా మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. కొడుకు అభిలాష్ పదవ తరగతి చదువుతుండగా, కూతురు మనిషా ఏడవ తరగతి పెగడపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వారికి ఎల్ఐసీ డీవో ఆకారపు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఏజెంట్లు శనివారం రూ.10వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, జూలై 27 : మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బండారి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా టిఎస్‌టిఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట ఉప్పు శివలతో పాటు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు

పెద్దపల్లి రూరల్, జూలై 27 : మండలంలోని గోపయ్యపల్లి గ్రామం వద్ద శనివారం పెద్దపల్లికి వస్తున్న ఓ కారు విద్యుత్ స్థంభానికి ఢీకొని పొలంలోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాసులపల్లి గ్రామం నుంచి పెద్దపల్లి వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్థంభానికి ఢీకొని పంట పొలంలోకి దూసుకెళ్లినట్లు, కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారని తెలిపారు. విద్యుత్ స్థంభం కిందపడటంతో మరమ్మతు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఏఈ రవిచందర్ తెలిపారు.

జూలపల్లి ఎంపీవో బాధ్యతల స్వీకరణ

జూలపల్లి, జూలై 27 : మండల పంచాయతీ అధికారిగా పనిచేసిన కిరణ్‌ను ఇటీవల ప్రభుత్వం ముత్తారం మండలానికి బదిలిచేసింది. కాగా ఎలిగేడు మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న అనిల్‌రెడ్డిని జూలపల్లి మండలానికి బదిలీచేయగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జేఎల్ఎంల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జూలై27: విద్యుత్ శాఖలో జేఎల్ఎంలకు సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలు శనివారం పూర్తి అయినట్లు ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్షల అనంతరం రిజల్ట్‌ను వరంగల్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ పరిశీలకులు టీ.మధుసూదన్, హెచ్ఆర్డి చైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నిరసనలకు సిద్ధం'

గణేశ్‌నగర్, జూలై 27: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం నిరసనలకు సిద్ధం అవుతున్నట్లు కళాశాలల యాజమాన్య సంఘాల జిల్లా జాయింట్ కన్వీనర్ జి.కృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలలు నడపడానికి చాల ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని శాంతి దీక్ష, ప్రజావాణిలో వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యాదా రామకృష్ణ, అధ్యక్షులు వేంకటేశ్వర రావు,కార్యదర్శి శ్రీపాద నరేష్, శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ యతీంద్రుల స్మృతి వనానికి కృషి'

కరీంనగర్ కల్చరల్, జూలై 27: ఇటీవల పరమపదించిన జిల్లాకు చెందిన త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి(కలువకుంట కృష్ణమాచార్యులు) స్మృతి వనానికి కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం సప్తగిరికాలనిలో ఓ ఫంక్షన్‌హాల్‌లో జీయర్ స్వామి శిష్యులు, పూర్వాశ్రమ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ఆయన పాల్గొని స్వామీజీకి శ్రద్ధాంజలి ఘటించారు. స్వామీ జీతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకొని, పూర్వాశ్రమ కుటుంబ సభ్యులకు, బంధువులకు సానుభూతి తెలిపారు. కెఐఎస్ అనంతాచార్య సమన్వయం మధ్య సాగిన ఈ కార్యక్రమంలో శిష్యులు, పూర్వాశ్రమ కుమారులు డాక్టర్ కె శ్రీమన్నారాయణ, కె జగన్నాథాచార్యులు, కె సింహాద్రి, డాక్టర్ కె రామకృష్ణ, బీజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, డీఆర్‌ఓ పవన్‌కుమార్, కలెక్టర్ సీసీలు రాంమోహన్‌రావు, నరసింగారావు, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ నలిమెల భాస్కర్, బెల్లి యాదయ్య, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, డాక్టర్ కె వరప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు..


గోదావరిఖని నారాయణ పాఠశాలలో బోనాలతో చిన్నారులు..


కల్వచర్లలో కృష్ణవేణి విద్యార్థుల వేషధారణ

కోల్‌సిటీటౌన్, జూలై 27: గోదావరిఖని నారాయణ పాఠశాలలో శనివారం ఘనంగా బోనాల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగ బోనాల ఉత్సవమని, హిందూ పండుగలో ప్రత్యేకత ఉంటుందన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలిపే పండుగ అని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారులు బోనాలను ఎత్తుకొని పాఠశాల ఆవరణలో ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. పండుగ వాతావరణంలో పోతరాజు వేషధారణలు, చిన్నారులు నృత్యాలు చేయడం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం చైతన్యరావు, ప్రిన్సిపాల్ రజిని, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ డీన్ ఆంజనేయులు, వైస్‌ప్రిన్సిపల్ సౌభాగ్య, రమాదేవి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గాం, జూలై 27: మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలోని పోచమ్మ బోనాలు కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. గ్రామస్థులంతా పోచమ్మ బోనాలని ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య ముందుకు సాగారు. అమ్మవారికి కందుల సంధ్యారాణి బోనం సమర్పించి మొక్కుతీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాణాల స్వామి, శాఖపురం కుమార్, మేడారం నర్సయ్య, గుమ్ముల వెంకట నర్సయ్య, నవీన్, కొప్పుల శ్రీనివాస్, వేనుమాల రాంబాబు, సుధాకర్, శేఖర్, రాజు, గుమ్ముల శేఖర్, లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.


బోనం ఎత్తుకున్న సంధ్యారాణి, మహిళలు

రామగిరి, జూలై 27: మండలంలోని కల్వచర్లలోని ప్రగతి, కృష్ణవేణి ప్రైవేట్ పాఠశాలల్లో ఆషాఢ మాస బోనాల సంబరాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు పోతురాజు వేషాలతో హాజరుకాగా, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో బోనాలతో హాజరయ్యారు. కార్యక్రమాల్లో ప్రగతి కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి,కృష్ణవేణి డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిలో ఎత్తిపోతలు ప్రారంభం

ధర్మారం, జూలై 27 : మండలంలోని నందిమేడారంలో గల నంది రిజర్వాయర్ నుంచి శనివారం నీటీని విడుదల చేశారు. శనివారం సాయంత్రం నంది పంప్‌హౌస్‌లో 3150 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఇక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు.

'బిర్లా ఓపెన్‌మైండ్స్'లో ఫ్యామిలీ డే

కరీంనగర్ రూరల్, జూలై27: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌లో శనివారం ఫ్యామిలీ డే నిర్వహించారు. కిండర్ గార్డెన్ పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఫ్యామిలిడే ఎంతో ఉత్సాహంగా సాగింది, కుటుంబ సమేతంగా పిల్లలతో కలిసి వచ్చిన తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిర్లా కుటుంబాన్ని ఒకే వేదికపై చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు.

రోడ్డుపై వరినాట్లు వేసిన బీఆర్ఎస్ నాయకులు

ఓదెల, జూలై 27 : మండలంలోని గూడెం గ్రామంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల వ్యవసాయ భూములకు వెళ్లే రోడ్డులో మట్టి పోసి మరమ్మతులు చేశారని, అయినా కూడా ముసురు వర్షానికి రోడ్డంతా బురద మయమైందని నాయకులు తెలిపారు. దీంతో ఎవరు వాహనాల ద్వారా పనులకు వెళ్లకుండా పోతున్నామని వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు నాణ్యమైన మట్టిపోసి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉష్కమల్ల చంద్రమౌళి, బీఆర్ఎస్ నాయకులు ఉప్పుల శ్రీనివాస్, రేకుల సంపత్, సతీష్, రాజేందర్, రఘుపతి, కుమారస్వామి, ప్రవీణ్, రాజిరెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.


నాట్లు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పంచాయతీ కార్యదర్శులకు ఘన సన్మానం

పెద్దపల్లి రూరల్, జూలై 27 : మండలంలోని హన్మంతునిపేట గ్రామ పంచాయితి కార్యదర్శిగా విదులు నిర్వహించిన శ్రవణ్‌కుమార్ ఇటీవల బదిలీ కాగా మాజీ సర్పంచ్ తీగల సదయ్యతో పాటు పలువురు శాలువాతో సత్కరించారు. అలాగే నూతనంగా వచ్చిన అశోక్‌కు స్వాగతం పలుకుతూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా కోర్సులను ఎంచుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష - నూతన కోర్సుల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్


నూతన కోర్సుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, జూలై 27 : మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీకి సంబంధించిన కోర్సులను ఎంచుకొని విద్యనభ్యసించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం మండలంలోని పెద్దబొంకూర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలకు బీటెక్ బయోటెక్నాలజీ ఫార్మాస్యూటికల్ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాగా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రాంగణంలో కళాశాల డైరెక్టర్ ఎడవల్లి నవత, ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్‌లతో పాటు అధ్యాపకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డైరెక్టర్ నవత మాట్లాడుతూ ప్రస్తుత సమాజం వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతుందని, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ రంగాల్లో చాలా పరిశోధనలు జరుగుతున్నాయని, ఈ రంగంలోని నిపుణులు చాలా అవసరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ కోర్సులకు తమ కళాశాలకు మాత్రమే ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. ఎంసెట్ రెండవ విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు కోర్సులను ఎంపిక చేసే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, అకౌంట్ ఆఫీసర్ పవన్‌కుమార్, తో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు లైంగిక వేధింపులు?

కళ్యాణ్‌నగర్, జూలై 27: గోదావరిఖనిలోని ఒక ప్రముఖ ప్రభుత్వ విద్య సంస్థలో మహిళా కార్మికులపై ఒక కీలక ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. ఓ ప్రభుత్వ ఉన్నత విద్య సంస్థలో అవుట్ సోర్సింగ్‌కు సంబంధించి ఏజెన్సీలకు కాంట్రాక్టులు ఇచ్చారు. ఇక్కడ పని చేస్తున్న కొందరు మహిళా కార్మికులను ఒక కీలక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి లైంగికంగా వేధిస్తున్నట్లు కొంత కాలంగా ఆరోపణలు వస్తున్నాయి. పనులు, మస్టర్ల పేర తమపై ఒత్తిడి తెస్తూ నానా రకాలుగా బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. అతడు చెప్పిన విధంగా వినకపోతే పని స్థలాల్లో కించపరిచే మాటలతో వేధింపులకు గురి చేస్తున్నాడని పేర్కొంటున్నారు. ఈ విషయమై సదరు విద్యా సంస్థలో ద్వితీయ శ్రేణి బాధ్యున్ని కలిసి కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వేధింపుల నుంచి తమను రక్షించాలని వేడుకున్నట్లు తెలుస్తుంది. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకుల దృష్టికి కూడా సమస్య వెళ్లినట్లు సమాచారం. తాను పట్టణ ప్రాంతానికి చెందిన ఒక కీలక ప్రజా ప్రతినిధి సిఫార్సుతో పని చేస్తున్నానని, తనను ఎవరూ ఏమి చేయలేరంటూ సదరు ఉద్యోగి బెదిరింపులకు గురి చేస్తున్నాడని కార్మికులు పేర్కొంటున్నారు. పని స్థలాల్లో కార్మికులపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

ఇందుకు సంబంధించి చట్టాలు కూడా ఉన్నాయని, ఎవరు వేధింపులకు పాల్పడినా తమ దృష్టికి తీసుకురావాలంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రముఖ సంస్థలో ఇలాంటి ఆరోపణలు రావడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది.



వృత్తివిద్యా కోర్సుల పరీక్ష

ఫైవింక్లయిన్‌కాలనీ, జూలై 27: సింగరేణి సేవా సమితి ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో వృత్తివిద్యా కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం యాజమాన్యం పరీక్షలను నిర్వహించింది. సింగరేణి హైస్కూల్‌లో టైలరింగ్, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు 145 మంది పరీక్షకు హాజరయ్యారు. డీవైపీఎం వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధి శ్యాంసన్, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ ప్రతినిధి నరేష్, సేవా సమితి ఆర్జీ-2 కోఆర్డినేటర్ దేవారెడ్డి, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

జీడీకే 2ఇంక్లైన్‌లో ప్రమాదం

- ముగ్గురు కార్మికులకు గాయాలు - ఒకరి పరిస్థితి విషమం

గోదావరిఖని, జూలై 27: రామగుండం రీజియన్ జీడీకే 2ఇంక్లైన్‌లో శనివారం రెండవ షిఫ్టులో 3వసీమ్ 34వ లెవల్ వద్ద పైకప్పు కూలి ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. 34వ లెవల్ వద్ద శంకర్, నోయల్, సంపత్ పని చేస్తుండగా అకస్మాత్తుగా పైకప్పు కూలడంతో వారిపై బొగ్గు పెళ్లలు పడి గాయాలయ్యాయి. వారిని వెంటనే గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇందులో పరిస్థితి విషమంగా ఉంది. సింగరేణిలో గత వారం రోజులుగా వరుస ప్రమాదాలు జరుగుతుండడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓసీపీ-2లో మట్టి కుప్పలు కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందగా, గురువారం ఓసీపీ-1లో బ్లాస్టింగ్ చేస్తుండగా ఓ కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. వరుస ప్రమాదాలతో సింగరేణి కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్టీయూలో కార్మికుల పిల్లలకు కౌన్సెలింగ్

రామగిరి, జూలై 27: మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలతో సింగరేణి యాజమాన్యం చేసుకున్న ఒప్పందం మేరకు సంస్థ ఉద్యోగుల పిల్లలకు బీటెక్‌లో సీట్ల కేటాయింపునకు శనివారం కౌన్సెలింగ్ చేపట్టారు. ప్రతి బ్రాంచ్‌లో మూడేసి సీట్లతో ఎగ్జిక్యూటివ్స్ కోటా కింద ఆరు బ్రాంచ్‌ల్లో 18, కార్మికుల పిల్లలకు 18సీట్లు మొత్తం 36 కేటాయింపు చేపట్టారు. ఈ సీట్లకు కార్మికుల పిల్లలు 29 మంది దరఖాస్తు చేసుకోగా, అధికారుల పిల్లలు ఏడుగురు దరఖాస్తులు చేసుకున్నారు. కళాశాలలోని నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ముగ్గురు అధికారుల పిల్లలు, 12 మంది కార్మికుల పిల్లలు హాజరయ్యారు. ఇందులో ఇద్దరు అధికారుల పిల్లలు, 9 మంది కార్మికుల పిల్లలు ఐదు సీఎస్ఈ, నాలుగు సీఎస్ఎం, ఒకటి మైనింగ్, ఒకటి ఈఈఈలో సీట్లను ఎంపిక చేసుకున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఆధ్వర్యంలో జరిగిన కౌన్సెలింగ్‌లో జేఎన్టీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కృష్ణమోహన్, సింగరేణి హెచ్ఆర్‌డీ జీఎం కృష్ణయ్య, కార్పొరేట్ పర్సనల్ డీజీఎం విలాస్ పోద్దార్, ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, హెచ్ఆర్‌డీ డీజీఎం జాఫర్, శ్రీకాంత్, కళాశాల ఆఫీసు సూపరింటెండెంట్ రవీకుమార్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అధికారులు


మ్యాన్‌వే రెస్ట్ షెల్టర్‌లోకి చేరుకున్న వరద నీరు

ఓసీపీ-2 మ్యాన్‌వేలోకి వరద నీరు

రామగిరి, జూలై 27: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 మ్యాన్‌వేలోకి వరద నీరు చేరుకుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా పెద్దఎత్తున వరద నీరు మ్యాన్‌వే కార్యాలయానికి దానితో పాటుగా కార్మికులకు సంబంధించిన రెస్ట్ షెల్టర్‌కు బారీ ఎత్తున వరద నీరు చేరుకుంది. కార్మికుల రెస్ట్ షెల్టర్‌లోకి వరద నీరు చేరడంతో కార్మికులు విశ్రాంతి పొందలేని పరిస్థితి నెలకొంది. కార్మికుల రక్షణ, సంక్షేమంపై దృష్టి సారించాల్సిన యాజమాన్యం మ్యాన్‌వేలోకి వరద నీరు రాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


బీపీ పరీక్ష చేసుకుంటున్న మనాలీ ఠాకూర్

పాలకుర్తి, జూలై 27: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సేవాసమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ సూచించారు. శనివారం పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మక్కాన్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మనాలి ఠాకూర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో నియోజక వర్గం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ సంస్థ చేపట్టే పలు రకాల కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పొల్సాని శశికళ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

పాలకుర్తి, జూలై 27: మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య గన్‌శ్యామ్ దాస్ నగర్ గొడుగులు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. శనివారం జీడినగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ ఆసంపల్లి శ్రీనివాస్(వాసు) ఆధ్వర్యంలో ఉచిత నోట్ బుక్కుల పంపిణీ చేశారు. సూర సమ్మయ్య సైతం 34మంది పిల్లలకు గొడుగులు, పెన్నులు, పెన్సిల్స్ కంపాక్స్ బాక్స్‌లను తన స్వంతంగా తీసుకువచ్చి పాఠశాల తరుపున శ్రీనివాస్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆరుకాల సతీష్, డీసీసీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఇబ్రహిం, రెడ్డపాక మల్లేష్, వసంత, జ్యోతి శంకర్ నాయక్, భూతగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్కుల అందజేత

కోల్‌సిటీటౌన్, జూలై 27: గోదావరిఖని విఠల్‌నగర్, సంజయ్‌నగర్‌లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ ఆసంపల్లి శ్రీనివాస్(వాసు) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వీప్రకాష్ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ఉపాధ్యాయులు రజని, జ్యోతి, సుభాష్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మద్దెల రాజేష్ పాల్గొన్నారు.

ఐడీ కార్డులు పంపిణీ


ఐడీ కార్డులతో విద్యార్థులు

మంథని, జూలై 27: స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మంథనికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మారుపాక దత్తు, కార్తీక్‌లు శనివారం ఐడీకార్డులు, బెల్టులు ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 280 విద్యార్థులకు సైతం యూనిఫాంకు అనుగుణంగా ఐడీ కార్డులు, బెల్టులు తయారీ చేయించి పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు సైతం త్వరలోనే ఐడీ కార్డులు అందజేస్తామని వారు తెలిపారు. విద్యార్థులకు చేయూతనివ్వడానికి ముందుకు వచ్చిన మారుపాక దత్తు, కార్తీక్‌లను హెచ్ఎం సుమలత అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..


ఖని రహదారిపై ప్రమాదకరంగా మారిన టెలికాం అండర్‌గ్రౌండ్

కోల్‌సిటీటౌన్, జూలై 27: గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి ఫైవింక్లయిన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. రహదారిపై మధ్యలోనే టెలికాం విభాగానికి చెందిన అండర్‌గ్రౌండ్‌పై ఉన్న కప్పు కూలిపోయింది. దీంతో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచి కనపడకుండా పోవడంతో వాహనదారులు, పాదచారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈవిషయంపై సంబంధిత టెలికాం విభాగ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో సమీప వ్యాపారులు చెట్టు కొమ్మలను పెట్టి వాహనదారులకు తెలియజేస్తున్నారు. ఈవిషయంలో సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగులకు సీఎండీ అభినందనలు

పెద్దపల్లిటౌన్, జూలై 27: వర్షాలు విస్తారంగా కురుస్తుండటం వలన వినియోగదారులకు ఎక్కడ అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నందుకు అధికారులను, సిబ్బందిని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అభినందించారని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న చోట విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించడంలో వారి సేవలు శ్లాఘనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో గడచిన మూడు నెలల్లో దెబ్బతిన్న 532 విద్యుత్ స్థంబాలను, 24 వంగిన విద్యుత్ స్థంబాలు, 19 తుప్పు పట్టిన స్థంభాలను, వదులుగా ఉన్న 12 కిలోమీటర్ల లైన్లు, 58 స్టే వైర్లు మార్చామన్నారు. ఈకార్యక్రమంలో కొందరు రైతులు ముందుకు వచ్చి విద్యుత్ శాఖకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఇకపై ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టి విద్యుత్ వ్యవస్థను పటిష్ఠ పరచి విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

-మంథని సీఐ రాజు

మంథని, జూలై 27: యువత చెడు వ్యసనాలకు బానిసై తమ నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మంథని సీఐ బి.రాజు సూచించారు. మంథని సీఐగా బదిలీపై వచ్చిన రాజు తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ యువత మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు బానిసై తమ నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పట్టణంలో, గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అక్రమంగా గంజాయి విక్రయిస్తే తమ సమాచారం అందిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా దొంగతనాల నియంత్రణపై సైతం ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.